# 3. సాహిత్యంలో పిలకలు

సాహిత్య పిలకలను గురించి కబుర్లాడుకుంటా మన గానే చాలా మంది ఉత్తరాలు గుప్పించేరు. కొందరు తమ పిలకలసైజు, వయస్సు వగైరా వివరాలు పంపితే మరి కొందరు తమ పిలకల ప్రాముఖ్యతనూ, చరిత్రలనూ వివరించేరు.

"ఇన్నాళ్ళకయినా సాహిత్యంలో పిలకల ప్రాముఖ్యతను గుర్తించినందుకు మీ కివే మా జోహార్లు. మీ పిలక వెయ్యేళ్లు వర్ధిల్లుగాక" అని వ్రాశా రొకరు

"మా పిలక సాహితీ సమితి శతవార్షికం సందర్భంగా మీకు శాలువా కప్పాలని తీర్మానించాం. మీ ఖర్చుతో మా ఊరు వచ్చి వెళ్లగలరా ?" అని వేడుకున్నా రొకరు.

"మీ (మా) పత్రికలో యీ (మా) పిలక కవితను అచ్చుగుద్ది మా నవ పిలకలను ప్రోత్సహించండి" అని ఆదేశిస్తూ ఓ కిలో కవితను పంపారో నవ, యువ కవి పిలకగారు.

"మనది సెక్యులర్ స్టేట్ : పైగా సోషలిజం దిశగా దేకుతూన్న మహత్తర దశలో మన మీ నాడున్నాం. కనుక పిలకలూ, గడాలూ, మీసాలూ అన్నీ సమానమే. మరి మీరు

పిలకలకే ప్రాముఖ్యత నివ్వటం ఏమంత రాజ్యాంగ విహితంగాలేదు” అని నోటీసిచ్చారో సాహిత్య లాయరుగారు.

“ఖబర్దార్ ! మా పిలకల జోలికి వచ్చావో, నీ పిలకపీకి పెట్రోల్ పోసి తగలెట్టి ఆ బూడిదను నాటుసారాలో కలుపుకు తాగుతాం ! జాగ్రత్త” అని హెచ్చరించారో మాడరన్ సాహిత్య చాణక్యుడుగారు.

మన సాహిత్య రంగం చైతన్యవంతంగా ఉందనటానికీ ఉత్తరాలు చాలునని నేను సంతోషించాను. కాని, మా అప్పారావుగాడున్నాడు చూడండి ! వాడు నా సిగరెట్లే తాగి బ్రతుకుతున్నాననే కృతజ్ఞత అన్నా లేకుండా ఓ పిలక ప్రశ్న వేశాడు !

“అయితే, గురూజీ ! ఈ చైతన్యం పిలకల విషయంలోనేనా ? లేక సాహిత్య విషయంలో కూడానా ?” అని.

నిజమే ! పిలక అనేది ఈనాడు చాదస్తానికి చిహ్నం, మనలో చాదస్తపు సాహిత్య పిలకలకు ఏనాడూ లోటులేదు గానీ, ఆధునిక పిలకలు ఈ మధ్య కాస్త అడావిడి చేస్తూండటం మాత్రం గమనించదగ్గదే ?

హిప్పీల క్రాపులా ఒకనాడు దట్టంగా ఉన్న తమ సృజనాత్మక ప్రతిభ కాస్తా పిలక సైజుకు తరిగిపోగానే ఆ పిలకకో పీఠం తయారు చేసుకుని అమాయకులను అదరగొట్టి, మాయకులకు లంచమిచ్చి పూజలు చేయించుకునే “పిలక కవి

తిలక" గాళ్ళు మనకు చాలా మందే ఉన్నారు. వీళ్ళు తమ కవితను కనీసం ముక్కు మూసుకుని చదివే వాళ్ళైనా లేకున్నా, చందా లేసుకునో, ముష్టెత్తుకునో అచ్చుగుద్దుకుని, అమాయకుల్ని పట్టుకుని. 'నాయనా ! మా కవిత కొని పారాయణం చేయకుంటే కుక్క మాంసం తిన్నంత పాపం" అని మొహమాట పెట్టి మరీ అంటగడతారు.

"కవిత యన నేమి ! దానికి కన్ను, ముక్కు, మూతి ఇత్యాదు లుండునా ? అవి ఎట్లుండును ? అవి మీ కెందుకు కనిపించవు ?" అని చర్చ మొదలెడతాడో పిలక శేఖరుడు!

"ఉండును ! నేను చూచితిని; ఈ విషయమై శ్రీనాధు డిట్లనియె ! మన అవిద్యామంత్రిగా రిట్లని యుండిరి !" అని చర్చ కొనసాగిస్తాడు మరో పిలక కవితిలకుడు.

"ఈ చర్చ యనవసరము. బ్రూక్ బాండ్ కాఫీకన్నా బ్రూ కాఫీయే రుచిగా యుండును. కాన మీరు వచనములోనే కవిత వ్రాయుడు. అది సోషలిస్టు లక్షణము. అట్లు వ్రాసినచో చచ్చిన మరుక్షణం మీరు సరాసరి స్వర్గమునకే ఏగెదరు. అక్కడ గుమ్మములోనే మీకు రంభ, ఊర్వశులతోపాటు మీకు కాలేజీ రోజుల్లో ప్రేమించియు పొందలేకపోయిన సుబ్బమ్మ, సుహాసినులు కూడా స్వాగతమిచ్చి వాటేసుకుని ముద్దాడి. అమృతము త్రాగించెదరు" అని హామీ ఇస్తాడో వచన పిలక ప్రవక్త.

"నిజమే ! వచనములోనే ఏడ్చిన మన ఏడుపు ఎల్ల రకూ అర్థమగును...కానీ...కానీ...కానీ...కొద్దిగా ప్రాస. ఛందస్, కనీసం అంత్య ప్రాస యుండిన ఆ కవిత నిమ్మరసం కలిపిన చెరుకు పానకంలా పసందుగా నుండును" అంటాడు మరో సెమీ వచన పిలకుడు.

"షటప్ ! మీరు బూర్జువా కవి పిలకులు ! మీవన్నియు పాత పిలకలు. ఎర్ర కాగితాల మీద తెల్ల సిరాతో వ్రాయుటే అధునికత. అదే నేటి కవుల బాధ్యత" అంటాడు మరో మాడ్రన్ పిలక కవిశేఖరుడు.

ఈ పిలక స్పీచులన్నీ విని, చర్చలన్నీ చదివి. కవితలు మాత్రం చదవలేక సగం చచ్చిన మా అప్పారావు అంటాడు కదా !

"వీళ్ళింత రాద్ధాంతంచేసి అడపాదడపా పత్రికల్లో తమ పేర్లు చూసుకుని, చూపించుకుని మురిసిపోయి పిలకలు నవరించుకోవటం బాగానే ఉంది గానీ, అయితే ! గురూజీ ! అసలీ ప్రాసు కవిత్వం గానీ, పిలక కవిత్వం గానీ, గుండు కవిత్వం గానీ గోచీ కవిత్వం గానీ ఎవరికి ? ఎందుకోసం ? అనేదే పిలకగాడూ ఆలోచిస్తున్నట్లే లేదేమిటి ?" అని.

నిజమే : ఆలోచించాల్సిందే. కాని "మాకామాత్రం తెలీదా! మా కవిత్వం మీ కోసమే!" అని దబాయించే కవులు గదా వీళ్ళంతా: ఆ మాట మనం ఒప్పుకు తీరాల్సిందే! మరి,

ఈ కవిత్వమేదీ కూడా నిన్నూ, నన్నూ ఎందుకు చదివించటం లేదూ? ఆలోచింపజేయటం లేదూ? ఎందుకు కార్యోన్ముఖుల్ని చేయటంలేదూ, చదివి హాయిగా నిద్రబోవటం సంగతి తరువాత, ముందు అసలు చదవటానికి ఆసక్తి పుట్టేటంత వాడిగా, వేడిగా, సూటిగా ఈనాటి కవిత - అది పిలక బ్రాండయినా, మీసం బ్రాండయినా, గడ్డం బ్రాండయినా, మరే గోంగోర బ్రాండయినా కానివ్వండి-ఎందుకు ఉండటం లేదూ? అని ప్రతి ఆధునిక కవీశ్వరుడూ కాస్త ఆత్మవిమర్శన చేసుకుంటే పాతిక పిలకల్ని పీకి పాతిపెట్టినంత పుణ్యం.

పిలక మహాకవులకు నా మనవి ఏమంటే "ఓ మహాకవులారా, మీ పిలకలతో ఇప్పటికే విసుగెత్తి పోయాం. దయచేసి ఇతర్ల పిలకలకు వంకలు పెట్టటం మానేసి ముందు మీ పిలకలను సరిజేసుకుంటే ఈదేశంలో కనీసం సోషలిజమన్నా వచ్చినంత పుణ్యం."

(ఏప్రియల్ 1971)